

పారా స్విమ్మింగ్‌లో సచివాలయ ఉద్యోగి విజయం

ప్రజాశక్తి - కాకినాడ


ఇటీవల ఏలూరులో జరిగిన 7వ ఎపి స్టేట్ పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌లో స్థానిక సచివాలయానికి చెందిన ఉద్యోగి లంక నాగేశ్వరరావు ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌చార్జ్ కమిషనర్ కెటి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



ఉద్యోగిని అభినందిస్తున్న కమిషనర్ సుధాకర్

రాలిన విద్యాకుసుమాలు

- ఒకే రోజు ముగ్గురు విద్యార్థుల బలవన్మరణం
- తునిలో 10వ తరగతి విద్యార్థి, రాజమండ్రిలో ఇంటర్ విద్యార్థి, రామచంద్రపురంలో 5వ తరగతి విద్యార్థిని ఆత్మహత్య
- అందరూ ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులే
- యాజమాన్యాల ఒత్తిళ్లే కారణం?



విద్యా బుద్ధులు నేర్చుకుని వికసించాల్సిన విద్యాకుసుమాలు బలవంతంగా నేలరాలాయి. కన్నవారికి కన్నీటిని మిగిల్చాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మంగళవారం ఒక్కరోజే ముగ్గురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ప్రయివేటు విద్యాసంస్థల్లో చదువుతున్న వీరు... ఒత్తిళ్లను తాళలేక తనువు చాలించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.. ఇందులో ఐదో తరగతి విద్యార్థిని సైతం ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశమైంది.

ప్రజాశక్తి - కోటనందూరు, గొల్లప్రోలు, రామచంద్రపురం

కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. తుని పట్టణంలో పదో తరగతి విద్యార్థి, రాజమహేంద్రవరంలో జూనియర్ కళాశాల విద్యార్థి ఈ ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ రెండు ఘటనల్లోనూ చదువు ఒత్తిడే కారణంగా పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... తుని రూరల్ లోవకొత్తూరు పంచాయతీ పరిధిలోని సీతయ్యపేటకు చెందిన కోండ్రు కార్తీక్(15)



రోదిస్తున్న కార్తీక్ తల్లిదండ్రులు, బంధువులు

తునిలోని ఓ ప్రయివేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు చెందిన హాస్టల్‌లోనే ఉంటూ తరగతులకు హాజరవుతున్నాడు. సోమవారం రాత్రి స్టడీ రూమ్‌లో ఉరేసుకుని చనిపోయాడని స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం అందించింది. దీనిపై కార్తీక్ తండ్రి శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా ప్రాంతాన్ని పరిశీలించారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ప్రాథమికంగా అంచనా వేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన యాళ్ల సత్యదేవ్‌కుమార్(18) తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేటు విద్యాసంస్థలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవలే సత్యదేవ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. మంగళవారం సత్యదేవ్‌ను తండ్రి ప్రసాద్ కళాశాలలో దింపి ఇంటికి వచ్చాడు. అంతలోనే కాలేజీలో సత్యదేవ్‌కుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టుగా కాలేజీ యాజమాన్యం తెలిపింది. వెంటనే వారు తిరిగి రాజమహేంద్రవరం బయలుదేరారు. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేశారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియాల్సి వుంది

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణానికి చెందిన సిర్రా రంజిత పట్టణంలోని ఒక ప్రయివేటు స్కూల్లో ఐదో తరగతి చదువుతోంది. మంగళవారం ఆమె ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని రంజిత(10) ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు. దర్యాప్తు చేస్తున్నామని త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని వారు చెబుతున్నారు.

ప్రయివేటు విద్యాసంస్థల ఒత్తిళ్లు

విద్యార్థుల మరణాలకు ప్రధాన కారణం ఒత్తిళ్లేనని పోలీసులు సైతం నిర్ధారించారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు అవలంభిస్తున్న విధానాలే దీనికి కారణంగా కనిపిస్తున్నాయి. ర్యాంకులు, మార్కులే పరమావధిగా ప్రయివేటు విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయి. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ విద్యార్థులను చదువు పేర ఒత్తిళ్లకు గురి చేస్తున్నాయి. డైలీ, వీక్లీ, మంత్లీ పరీక్షలతో పాటూ స్టడీ అవర్లు అంటూ వేధిస్తున్నాయి. కొన్ని విద్యాసంస్థలు ఎలాంటి అనుమతులు కూడా లేకుండా హాస్టళ్లను సైతం నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మార్కులు తక్కువ వస్తే తీవ్రంగా మందలించడంతో పాటూ విద్యార్థుల తల్లిదండ్రులకు యాజమాన్యాలు ఫిర్యాదులు చేస్తున్నాయి. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురై మానసిక వేదనకు గురవుతున్నారు. జిల్లాలో ఉన్న పలు ప్రముఖ విద్యాసంస్థలన్నీ ఇవే కోవలోకి వస్తాయి. సెలవుల్లో సైతం తరగతులు నిర్వహిస్తున్న దాఖలాలు కోకొల్లలు. దీనిపై విద్యార్థి సంఘాలు గొంతెత్తినా అధికారులు చర్యలు శూన్యం. తుని, రాజమహేంద్రవరంలో జరిగిన ఈ రెండు ఘటనల్లోనూ విద్యార్థులు తీవ్ర ఒత్తిళ్లకు లోనైట్లు స్నేహితులు చెబుతున్నారు. ఇంటి దూరంగా ఉండటంతో ఒంటరితనానికి లోనవుతున్నారు. లక్షలు ఖర్చు చేస్తున్న తల్లిదండ్రులను బాధపెట్టలేక, యాజమాన్య వేధింపులు భరించలేక తనువును అర్థాంతరంగా చాలిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు

మడ అడవులను రక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మడ అడవులను రక్షించాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం కాకినాడ రూరల్ మండల కమిటీ సమావేశం టి.రాజా అధ్యక్షతన సుందరయ్య భవన్‌లో మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు హాజరై మాట్లాడారు. కాకినాడ జిల్లా రక్షణకు మడ అడవులు కవచంగా ఉన్నాయన్నారు. తూరంగిలో ఉన్న మడ అడవులు, చిత్తడి నేలలు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. తాళ్లరేవు వరకూ ఉన్న తీర ప్రాంత భూములు నేడు రియల్ ఎస్టేట్లుగా, చేపలు, రొయ్యల చెరువుగా మారిపోయాయన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకుని మడ అడవులను రక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిపిఎం రూరల్ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడారు. తుపాను సమయంలో అధికార యంత్రాంగం స్పందించిన తీరు అభినందనీయమన్నారు. తూరంగి పంచాయతీ అల్లూరు సీతారామరాజు కాలనీ సర్వే నెంబర్ 218లో చట్ట విరుద్ధంగా ఆక్రమణలు చేస్తున్న రియల్టర్లను అడ్డుకోవడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందన్నారు. 14 ఎకరాల్లో విస్తరించిన మడ అడవులు, చిత్తడి నేలలో 2 ఎకరాలను ఆక్రమించి పెంకె జైన్‌కుమార్, సోంబాబు అక్రమ కట్టడాలు కడుతున్నా అడ్డుకున్న దాఖలాలు లేవన్నారు. ఇవి సిఆర్‌జెడ్ పరిధిలోకి వస్తున్నా రెవెన్యూ, పంచాయతీ, కుడా, ప్రభుత్వ సంస్థలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. దీనిపై వెంటనే తగ్గిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మడ అడవుల వల్లే కాకినాడలో సముద్రపు కోత లేదన్నారు. ఈ మడ అడవులు లేని ఉప్పాడ ప్రాంతం సముద్రం అలలకు కోతకు గురవుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇంత ప్రాముఖ్యత ఉన్న మడ అడవులను రక్షించాలన్నారు. గతంలో వైసిపి హయాంలో దుమ్ములపేటలో మడ అడవులను ధ్వంసం చేశారన్నారు. దీనిపై పర్యావరణవేత్తలు పోరాడి దుమ్ములపేట మడ అడవులను రక్షించుకున్నారన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలోనూ మడ అడవులు ధ్వంసం అవుతున్నాయన్నారు. అయినా ప్రభుత్వం స్పందించట్లేదన్నారు. మడ అడవులను రక్షించుకోలేకపోతే దుమ్ముల పేట, టిమొగ, ముత్తా నగర్, మహాలక్ష్మి నగర్, అల్లూరి సీతారామ రాజు కాలనీ, డ్రైవర్స్ కాలనీ, పగడాలపేట, ఉప్ప లంక, తాళరేవు వరకూ పది ప్రాంతాలు రానున్న కాలంలో విపత్తులకు బలి అవుతాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని, రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సిహెచ్.అజయ్‌కుమార్, పి.రామకృష్ణ, సిహెచ్.విజయ్‌కుమార్, సూర్యం పాల్గొన్నారు.



తూరంగా అల్లూరి సీతారామరాజు కాలనీలో సర్వే నెంబర్ 218లో రియల్టర్లు నిర్మించిన రోడ్లు, ప్రహరీ

బస్సులు ఆపాలని విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - జగ్గంపేట



రోడ్డుపై ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మండలంలోని కాట్రావులపల్లి, తిమ్మాపురం జంక్షన్ వద్ద కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కాట్రావులపల్లి, తిమ్మాపురం గ్రామాలకు చెందిన విద్యార్థులు జగ్గంపేట, పెద్దాపురంలోని కళాశాలకు వెళ్తారు. తిమ్మాపురం జంక్షన్‌లో ఆర్‌టిసి బస్సు లను ఆపకపోవడంతో విసుగెత్తిన విద్యార్థులు రోడ్డుకి అడ్డంగా నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. దీంతో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథ రావు సంఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించడం సరికాదని విద్యార్థులకు సూచించారు. దీంతో విద్యార్థులు తమకు బస్సు పాసులు ఉన్నప్పటికీ బస్సులు ఆపకపోవడంతో కళాశాలకు సమయానికి చేరుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలకు డబ్బులు చెల్లించి వెళ్తున్నామన్నారు. ఆర్‌టిసికి డబ్బులు కట్టి పాసులు తీసుకున్న ఉపయోగం లేదన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తామని సిఐ హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తప్పుడు మార్గాలను ఎంచుకోవద్దు

ప్రజాశక్తి - కాకినాడ




సదస్సులో మాట్లాడుతున్న ఎస్‌పి జి.బిందుమాధవ్

తాత్కాలిక ఆనందం కోసం తప్పుడు మార్గాలను ఎంచుకోవద్దని, మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని ఎస్‌పి జి.బిందుమాధవ్ పిలుపునిచ్చారు. మంగళవారం జెఎన్‌టియుకెలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళలపై జరిగే నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి నైతిక విలువలు, క్రమశిక్షణ, సైబర్ అవగాహనతో ముందుకు సాగితేనే సురక్షిత సమాజాన్ని నిర్మించగలమని ఎస్‌పి అన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌ల బారిన పడకుండా పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. డిఎస్‌పి పాటిల్ దేవరాజ్‌మనీష్ మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో మత్తు పదార్థాల దుర్వినియోగం, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న దాడులు సమాజానికి తీవ్రమైన సవాళ్లన్నారు. విద్యార్థులు సాంకేతికతను సమాజ అభివృద్ధికి వినియోగించాలని సూచించారు. ప్రతి విద్యార్థి చైతన్యవంతుడై, ఇతరులకు అవగాహన కల్పించే మార్గ దర్శకుడిగా మారాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెఎన్‌టియుకె విసి ప్రొ సిఎస్ఆర్‌కె.ప్రసాద్, జెఎన్‌టియుకె ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జి. శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ పీడీలు ఎన్.రమణాజీ, ఎంవిఎస్‌వి.కిరణ్మయి, డాక్టర్ పి.వీరలక్ష్మి, యుసిఇకె ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.మోహన్‌రావు, అధ్యాపకులు, డైరెక్టర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురికి ముదునూరి పరామర్శ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



బాధితునికి నగదును అందిస్తున్న ముదునూరి

మండలంలోని పోతులూరు గ్రామానికి చెందిన పలువురిని ఎంఎంఆర్ ట్రస్ట్ ఛైర్మన్ వైసిపి నరసాపురం పార్లమెంటు పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మంగళవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన బోడ సూజమ్మ, శ్రీమంతుల అర్జునుడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలోనే ఆయన బాధితులను పరామర్శించారు. ఇద్దరు బాధితులకు రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొండి రాంబాబు, శెట్టి సత్తిబాబు, ముప్పిడి ఏసుబాబు, చక్కపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి - సామర్లకోట



విద్యార్థినులతో మాట్లాడుతున్న డిఇఒ రమేష్

చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డిఇఒ పి.రమేష్, డిసిఇబి సెక్రటరీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక జడ్‌పిహెచ్ఎస్ బాలికల పాఠశాలను, మున్సిపల్ హైస్కూల్‌ను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు 8 నుంచి 9 గంటలకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ స్టడీ అవర్స్ నిర్వహించాలని, అలాగే 6 నుంచి 9వ తరగతిలో వెనకబడిన విద్యార్థులు గుర్తించి వారికి సాయంత్రం ఒక గంట అదనంగా స్టడీ అవర్స్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా తీశారు. ఈ పర్యటనలో ఎంఇఒ-2 పి.పుల్లయ్య, హెచ్ఎంలు విజయలక్ష్మి, తాండ్ర శ్యాంసుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి - కాకినాడ



ఆసుపత్రిలో నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి శానిటేషన్ విభాగంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న కార్మికులు తమ జీతాలు పెంపుదల చేయాలని కోరుతూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. గత వారం రోజులుగా వివిధ రూపాల్లో కార్మికులు ఆందోళన నిర్వహిస్తున్నారు. మంగళవారం జిజిహెచ్ తల్లి పిల్ల విగ్రహం వద్ద నుంచి ఆసుపత్రి ఆవరణలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శేషు మాట్లాడుతూ గత 25 సంవత్సరాల నుంచి శానిటేషన్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్నామని, నాటి నుంచి నేటి వరకు చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా వచ్చిన క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీస్ కాంట్రాక్ట్ సంస్థ జిఒ ప్రకారం రూ.18,600 వేతనం ఇవ్వాల్సివుండగా రూ.14,200 మాత్రమే ఇస్తున్నదని తెలిపారు. కార్మికులు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని ఇబ్బందులకు గురిచేస్తున్న జిజిహెచ్ అధికారులు జీతాల పెంపుదలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో-కన్వీనర్ పలివెల వీరబాబు, నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, యూనియన్ నాయకులు రమేష్, తలుపులమ్మ, కృష్ణవేణి, మంగతాయారు, ఏసు, వాసు, కుమారి, సూరి పాల్గొన్నారు.

వివిఎస్ విద్యార్థికి బహుమతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

చెకుముకి సంబరాల్లో వివిఎస్ విద్యార్థికి మొదటి బహుమతి వచ్చినట్లు వివిఎస్ విద్యాసంస్థల అధినేత అనిశెట్టి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో తమ విద్యా సంస్థకు చెందిన 9వ తరగతి విద్యార్థి జ్ఞానగమ్య మండల స్థాయిలో మొదటి బహుమతి సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థి జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నదని ఆయన తెలిపారు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని అచ్చంపేటలో ఉన్న 33/11 కెవి కొత్త సబ్ స్టేషన్ లైన్ వర్క్ నిమిత్తం బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పనసపాడు, అచ్చంపేట, గొప్పవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ప్రత్తిపాడు రోడ్‌లోని జగన్ కాలనీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం కాలనీతో పాటు, సమీపంలోని వ్యవసాయ భూములకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజ్యాంగ దినోత్సవ పోటీలో ప్రథమ స్థానం

ప్రజాశక్తి - కరప

నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ పోటీల్లో స్థానిక జడ్‌పిహెచ్ఎస్ 10వ తరగతి విద్యార్థి శీలం శ్రీసాయిలక్ష్మి ప్రసన్నకీర్తి ప్రథమ స్థానంలో నిలిచిందని హెచ్ఎం రాజేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను ఎంఇఒలు కృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఎస్ఎంసి ఛైర్మన్ అభినందించారు.

లస్కర్లకు రెయిన్ కోట్లు అందజేత

ప్రజాశక్తి - పిఠాపురం

నీర్టిపారుదల శాఖ లస్కర్లకు రైన్ కోట్లను పంపిణీ చేశారు. మంగళవారం పిఠాపురం ఇరిగేషన్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ పాల్గొని పిబిసి పరిధిలోని 14 మంది లస్కర్లకు రెయిన్ కోట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సాగునీటి సంఘాల డిసిలు, ఇరిగేషన్ డిఇ సంతోష్‌కుమార్, జెఇలు పద్మజ, భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

వన సమారాధనలు విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఈ నెల 9న కాకినాడ, 16న అమలాపురంలో నిర్వహించే శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలు విజయవంతం చేయాలని సంఘ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, దొంగ శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాసు పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్ హాలులో జరిగిన సంఘ సమావేశంలో వనసమరాదన కరపత్రాలను ఆవిష్కరించారు. కుటుంబ సమేతంగా వన సమారాధనల్లో పాల్గొనాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - కోటనందూరు

మండలానికి చెందిన ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ టి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. రాష్ డ్రైవింగ్ చేసినా, మద్యం సేవించి వాహనం నడిపిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాట్సాప్‌లో వచ్చిన ప్రతి లింకును ఓపెన్ చేయొద్దని, ఒటిపి నెంబర్లు అపరిచిత వ్యక్తులకు చెప్పొద్దని, డిజిటల్ అరెస్టు చేస్తామని ఫోను చేసి బెదిరించిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కార్టూ'నిజం'



ఉత్సాహంగా చెకుముకి సైన్సు పోటీలు

జిల్లాలోని పలు మండలాల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్సు సంబరాలు జరిగాయి. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జెవివి ఆధ్వర్యంలో జరిగాయి. మండల వ్యాప్తంగా 15 జూనియర్స్, సీనియర్స్ జట్లు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాన్ని ఎంఇఒలు వెన్న శ్రీనివాస్, బి.వెంకటశివప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ నీతిపూడి సెలట్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు వి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించేందుకు చెకుముకి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో వన్నెపూడి జడ్‌పి హైస్కూల్, జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానాన్ని తాటిపర్తి జడ్‌పిహెచ్ఎస్, ప్రయివేటు పాఠశాల విభాగంలో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో ప్రథమ స్థానంలో చేబ్రోలు శ్రీ గౌతమి నిలిచింది. ఈ కార్యక్రమంలో జెవివి మండల గౌరవ అధ్యక్షులు దాడి పద్మనాభం, అధ్యక్షులు ఏలేటి నానిబాబు, పాఠశాల హెచ్ఎం సిహెచ్.సూర్యప్రకాశ్‌రెడ్డి, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎంవి.సత్యనారాయణ, జెవివి ప్రధాన కార్యదర్శి డి.గోవిందరాజులు పాల్గొన్నారు.



జగ్గంపేటలో బహుమతులు అందిస్తున్న జెవివి ప్రతినిధులు

రౌతులపూడి స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షులు బేటా వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో పలు పాఠశాలల నుంచి 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు కొరుప్రోలు హరిబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విజ్ఞప్రవళిక, మౌనిక, శైలజలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కోళ్ల రాంబాబు, యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులు తాతబాబు, ఉపాధ్యాయులు పైల శివకుమార్, విజయ్ పాల్గొన్నారు. **జగ్గంపేట** స్థానిక యుటిఎఫ్ హోంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో భాష్యం జట్టు నిలిచిందని, ఈ జట్టు జిల్లా స్థాయి పరీక్షలకు ఎంపికైనట్లు జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు బి.కోటేశ్వరరావు తెలిపారు. అలాగే జూనియర్స్ విభాగంలో ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు, శ్రీఅమృత ఇంగ్లీష్ మీడియం స్కూల్, భాష్యం పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఎంఇఒ-2 సుబ్రహ్మణేశ్వరరావు, యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సాయిరాం, వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ ఒమ్మి రఘురాం ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు జి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

నిందితునికి జైలు, జరిమానా

ప్రజాశక్తి - గొల్లప్రోలు

17 ఏళ్ల అమ్మాయిని కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన కేసులో నిందితునికి ఫోక్సో కోర్టు జడ్జ్ కె.శ్రీదేవి జైలు శిక్ష, జరిమానాను విధించినట్లు సిఐ జి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణానికి చెందిన మచ్చ రామ్మోహన్ 2017లో ఒక కళాశాల నుంచి 17 ఏళ్ల అమ్మాయిని బలవంతంగా తీసుకెళ్లి అత్యాచారం చేసిన ఘటనలో నమోదైన కేసుపై 8 ఏళ్ల అనంతరం కోర్టులో సుదీర్ఘ వాద, ప్రతివాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పు నిచ్చారని తెలిపారు. నిందితుడు మచ్చ రామ్మోహన్‌రావుకి ఒక కేసులో ఐదేళ్ళ జైలు, రూ.5000 జరిమానా, మరో కేసులో 11 ఏళ్ళ జైలు, రూ.6000 జరిమానాను విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని అన్నారు. ఈ కేసులో పిపిగా జి.రత్నబాబు వాదనలు వినిపించారు.

అత్త, వదినలపై కత్తితో దాడి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

అత్త వదినలపై అల్లుడు కత్తితో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన మండలంలోని తిరుమలి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రామలింగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని తిరుమలి గ్రామానికి చెందిన రామకృష్ణ అప్పలరాజు, సూరిబాబు దంపతులకు ఇద్దరు కుమార్తెలుండగా చిన్న కుమార్తె దుర్గాదేవిని నాలుగేళ్ల క్రితం రాయవరం మండలం వెదురుపాక గ్రామానికి చెందిన పెంటపాటి హరిబాబుతో వివాహం చేశారు. అయితే మనస్పర్ధల కారణంతో వీరిరువు విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో హరిబాబు తిరుమలి గ్రామానికి మంగళవారం రాత్రి మద్యం సేవించి వచ్చి అత్త అప్పలరాజు(45)పై వేట కొడవలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. అడ్డు వచ్చిన పెద్ద కుమార్తె కేసనకుర్తి నాగదుర్గాసాయిపై దాడి చేయడంతో ఇరువురు తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రులను ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అత్త అప్పలరాజు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పెరవలి

పెరవలిలో జాతీయ రహదారి పక్కన ఉన్న రైతు బజార్ షెడ్ వద్ద గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని పోలీసులు తెలిపారు. మృతుని వయస్సు 50 నుంచి 50 ఏళ్ల మధ్య ఉంటుందనారు. నీలం రంగు గళ్ల పొడవు చేతుల చొక్కా, సిమెంటు రంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 9440796642, 7013140882 నెంబర్లను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు.

పోక్సో కేసులో నిందితుని అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడు షేక్ గౌస్ మొహిద్దీన్‌ను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. రామచంద్రపురం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్లు అంగర ఎస్ఐ జి.హరీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరు గ్రామానికి చెందిన ఓ యువతిపై అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపణపై బాధితురాలి తల్లి రెండు రోజుల క్రితం పోక్సో కేసు నమోదైంది. కేసు దర్యాప్తులో భాగంగా డిఎస్‌పి రఘువీర్ ఆదేశాలపై నిందితుడిని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

అతిగా మద్యం సేవించి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - సీతానగరం

అతిగా మద్యం సేవించడంతో వృద్ధుడు మృతి చెందాడు. రఘుదేవపురానికి చెందిన గొలిసే వీర్రాజు (66) ఈ నెల 2న అతిగా మద్యం సేవించాడు. అనంతరం నల్గొండలో ఉన్న వారి జీడిమామిడి తోటకు సైకిల్‌పై వెళ్లాడు. అక్కడ అస్వస్థతకు గురై పడిపోయాడు. గ్రామస్తులు గుర్తించి కుమారుడు కృష్ణకు సమాచారం అందించారు. వెంటనే కృష్ణ తన తండ్రిని హుటాహుటిన రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

డీజిల్ కల్తీపై విచారణ

ప్రజాశక్తి - కాట్రేనికోన

స్థానిక గేటు సెంటర్లోని ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన పెట్రోల్ బంకులో డీజిల్ కల్తీపై పోలీసులు, రెవెన్యూ అధికారులు మంగళవారం విచారణ చేశారు. కాట్రేనికోన గేటు సెంటర్లోని ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన పెట్రోల్ బంకులో డీజిల్ కల్తీ జరిగి అశోక్ లేలాండ్ మినీ వ్యాన్ వెహికల్ ఇంజన్ పాడైందని ద్రాక్షారామానికి చెందిన డ్రైవర్ సానబోయిన తరుణ్ కాట్రేనికోన పోలీస్‌స్టేషన్‌లో, తహశీల్దార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. రూ.50 లీటర్లు ఫైగా మరమ్మతులకు అవుతుందని అతను వాపోయాడు. ఈ సంఘటనపై మంగళవారం సాయంత్రం కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ విచారణ చేశారు.



స్వాధీనం చేసిన లారీతో అధికారులు

అనుమానాస్పద లారీ స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట

వల్లూరు శివారు వేట్లపాలెం వెళ్లే కెనాల్ రోడ్లో అనుమానాస్పదంగా వెళుతున్న లారీని రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద లోడుతో లారీ వెళ్తుందని వచ్చిన సమాచారంతో తహశీల్దార్ కొప్పుల చంద్రశేఖర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఎడిఇ దుర్గాలక్ష్మి, వ్యవసాయ శాఖ ఎఒ వంగపండు మురళీధర్ ఆ వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో లారీని వదిలిపెట్టి డ్రైవర్ పరారయ్యాడు. లారీని విచారించగా లారీలో ఉన్న బస్తాల్లో పోటాష్‌యంగా అధికారులు భావిస్తున్నారు. వాహనాన్ని పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న సరుకును ల్యాబ్‌కు పంపించి తదుపరి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ తెలిపారు.

యానాం వార్తలు



చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

ఉత్సాహంగా చెకుముకి పోటీలు

ప్రజాశక్తి - యానాం

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మంగళవారం స్థానిక మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బ్లాక్ లెవెల్ చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో మహాత్మా గాంధీ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రథమస్థానం, కమలా నెహ్రూ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కనకాలపేటలోని ఎస్‌కెఎస్‌పివిఆర్ఎస్.ప్రభుత్వ పాఠశాల ద్వితీయ స్థానం సాధించాయి. ప్రయివేట్ పాఠశాలల విభాగంలో నల్లం రెసిడెన్షియల్ పాఠశాల ప్రథమ స్థానం, శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాల ద్వితీయ స్థానం, రీజన్సీ పబ్లిక్ స్కూల్ తృతీయ స్థానం పొందాయి. ప్రభుత్వ, ప్రయివేటు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన పాఠశాల జట్లు ఈ నెల 23న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయని అధ్యక్షులు ఆనాల వీరభద్రరావు తెలిపారు. విద్యార్థులకు చెకుముకి మాస పత్రిక, ధృవపత్రం, బుక్స్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు, స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు బాలకృష్ణ, మాధవి, జెవివి రాష్ట్ర నాయకుడు కెవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాంలో యూనిటీ మార్చ్

ప్రజాశక్తి - యానాం

యానాంలో యూనిటీ మార్చ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ అంకిత్‌కుమార్ జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం చిల్డ్రన్స్ ఆడిటోరియంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ గొప్పతనాన్ని యువతకు వివరించారు. ఇటీవల ప్రైమ్ వాలీబాల్ లీగ్ చెన్నై జట్టులో స్థానం సంపాదించి మంచి ప్రతిభను కనబరిచిన కైలా విష్ణువర్ధన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి తిర్రి గోపి, ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, మదర్ థెరిసా నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ కనకాల శ్రీనివాస్, మై భారత్ సిబ్బంది మన్నే కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు శ్రీనివాస్, శాంతరాజు, ఆనంద్, వీర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్‌నాథన్‌ను యానాం కాంగ్రెస్ నాయకులు అర్థాని దినేష్, కాటంశెట్టి రామూర్తి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యానాంకు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పరిశ్రమలు మూతపడడంతో యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. బొటానికల్ గార్డెన్, ఈఫిల్ టవర్, దరియాలతిప్ప వాక్వే బ్రిడ్జ్ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. రోడ్లు, డ్రెయిన్లు నిర్మించాలని, పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని వివరించారు. గతంలో మెడికల్ సీట్లలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని కోరినట్లు తెలిపారు. యానాం ఓల్డేజ్ హోంకి ముకేశ్‌అంబానీ ప్రతి ఏడాది రూ.2 కోట్లు ఇస్తున్నారని, ఆ నిధులు వినియోగంపై విచారణ చేపట్టాలని కోరినట్లు వారు తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్‌ను కలిసిన వారిలో విళ్ళ చిన్ని, మచ్చా శ్రీపతి, ఐ.సుధాకర్ ఉన్నారు.

భార్యను చంపిన భర్త

ప్రజాశక్తి - యానాం

భార్యాభర్తల ఉన్న వివాదాల నేపథ్యంలో భార్యను భర్త హత్య చేసిన ఘటన యానాంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక బల్లవారి వీధిలో భార్యాభర్తలు పెమ్మాడి నాని, పెమ్మాడి దీనా గత 4 నెలలుగా ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. వీరిద్దరి మధ్య గొడవులు రావడంతో మంగళవారం భార్య దీనా(26)ను భర్త నాని హత్య చేసి పరారయ్యాడు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు. సంఘటన స్థలాన్ని ఎస్‌పి వరదరాజన్, ఎస్ఐలు పునీత్‌రాజ్, కట్టా సుబ్బరాజు పరిశీలించారు. నిందితుడు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిలో దూకిన యువతి

ప్రజాశక్తి - యానాం

యానాం నీలపల్లి వంతెనపై నుంచి ఓ యువతి మంగళవారం రాత్రి గోదావరిలో దూకింది. యువతి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల వివరాల మేరకు.. తాళ్ళరేవు మండలం పరిధిలోని జార్జి పేట పంచాయతీ తూర్పు పేటకు చెందిన కల్యాణి (19)గా గుర్తించామన్నారు. తాళ్లరేవులో ఓ కిరాణా కొట్టులో పని చేస్తుందన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

చెత్తను పారిశుధ్య కార్మికులకే ఇవ్వాలి

ప్రజాశక్తి - కాకినాడ

చెత్తను రోడ్ మీద వేయకుండా పారిశుధ్య కార్మికులకే అందజేయాలని నగరపాలక సంస్థ ఇన్‌ఛార్జ్ కమిషనర్ కెటి.సుధాకర్ సూచించారు. మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. సంత చెరువు పార్క్‌లో నెలకొన్న సమస్యలపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను వాకర్లు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించిన ఆయన అల్పాహారం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, వాటర్ వర్క్స్ డిఇ లక్ష్మీనారాయణ, శానిటేషన్ సూపర్‌వైజర్ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్ట్ ఇయర్ చదువుతున్న విద్యార్థి జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యాడు. ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఆల్ ఇండియన్ ఇంటర్ యూనివర్సిటీ సెలెక్షన్స్‌లో సోమవారం వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. రిలీజింగ్ పోటీల్లో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న వై.కృష్ణార్జున్, ఎం.దుర్గాప్రసాద్ పాల్గొని ప్రథమ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రథమ స్థానంలో నిలిచిన కృష్ణార్జున్ 2026 జనవరిలో పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. డిగ్రీ కళాశాలకు కీర్తి తెచ్చిన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపల్ దేవరపల్లి చెన్నారావు, అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వీరిని ఆదర్శంగా తీసుకుని క్రీడారంగంలో తను ప్రతిభను చాటలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్.బాలరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని ఖాళీ స్థలాలపై పన్ను వసూలు కోసం ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించినట్లు నగరపాలక సంస్థ డిసి కె.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం స్థానిక గైగోలపాడు, కర్ణం గారి సెంటర్ పరిసర ప్రాంతాలను పర్యటించి, ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన చెత్త పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశాలతో నగరంలో పన్నులు చెల్లించని ఖాళీ స్థలాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఆయా యజమానులు నవంబర్ 25లోపు పన్నులు తప్పనిసరిగా చెల్లించాలన్నారు. ఆ గడువు నాటికి చెల్లించకపోతే, సంబంధిత స్థలాలను ప్రభుత్వానికి 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితుల జాబితాను వేగంగా సిద్ధం చేయాలని ఎంపి గంటి హరీష్‌మాధుర్, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో లబ్ధిదారుల జాబితాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెల 31న పెదవలసల గ్రామంలో మత్స్యకారులకు బియ్యం, నిత్యవసరాల పంపిణీ ప్రారంభించామని, లబ్ధిదారులందరికీ వెంటనే అందజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అయితే అధికారులు నేటి వరకు పూర్తిస్థాయిలో జాబితా తయారు చేయకపోవడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీనిపై తహశీల్దార్ త్రినాథరావు మాట్లాడుతూ పంచాయితీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సమన్వయంతో జాబితాను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఎంపిడిఒ లక్ష్మణరావు, నాయకులు ధూళిపూడి వెంకట రమణ, నడింపల్లి వినోద్, టేకుమూడి లక్ష్మణరావు, కట్ట త్రిమూర్తులు, వేగేశ్న భాస్కర రాజు, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, జక్కల ప్రసాద్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక ఆర్ఆర్‌బిహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'సైబర్ క్రైమ్, యాంటీ డ్రగ్స్, మహిళా భద్రత' అంశాలపై అవగాహనా సదస్సు జరిగింది. మంగళవారం జరిగిన ఈ సదస్సులో ఎస్ఐ మణికుమార్ మాట్లాడుతూ సోషల్ మీడియా వేదికల్లో వ్యక్తిగత వివరాలు పంచుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనుమానాస్పద లింకులు ఓపెన్ చేయవద్దని, ఆన్‌లైన్ ఆఫర్లను నమ్మరాదన్నారు. బ్యాంక్ పాస్‌వర్డ్‌లు, ఒటిపిలు ఎవరికీ చెప్పకూడదన్నారు. విద్యార్థినుల పట్ల ఎవరైనా వేధింపులు లేదా అనుచితంగా ప్రవర్తిస్తే పోలీసులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెగా రక్తదానం శిబిరం

ప్రజాశక్తి - తాళ్లరేవు

జడ్‌పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్‌సాగర్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, వైసిపి సిఇసి సభ్యులు పితాని బాలకృష్ణ, రాష్ట్ర నాయకులు చింతలపాటి శ్రీనివాసరాజు ప్రారంభించారు. 75 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వెంటపల్లి నూకరాజు, పెయ్యల మంగేష్, వైసిపి నాయకులు పెట్ల సూర్యనారాయణరాజు, కాదా గోవిందకుమార్, కొప్పిశెట్టి వెంకట్, కాలా వెంకటరమణ, కొటికలపూడి చంద్రశేఖర్, మట్టపర్తి లోవరాజు పాల్గొన్నారు.

సిసి కెమెరాల అందజేసిన కోరమాండల్



ఎస్‌పికి వివరిస్తున్న కోరమండల్ ప్రతినిధులు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో భద్రతా వ్యవస్థను బలోపేతం చేసేందుకు వీలుగా కోరమాండల్ ఎరువుల కర్మాగారం సిసి కెమెరాలు, హెల్మెట్లు అందజేసింది. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌పి జి.బిందుమాధవ్‌కు సంస్థ ప్రతినిధులు సిసి కెమెరాలను, హెల్మెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీస్ వ్యవస్థలో భద్రతా పర్యవేక్షణను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతికత ఆధారంగా స్ట్రాటజిక్ రెస్పాన్స్ సెంటర్ (కమాండ్ కంట్రోల్) పనితీరును మరింత అభివృద్ధి చేయడం, పబ్లిక్ సేఫ్టీ, నిఘా, ట్రాఫిక్ మానిటరింగ్, నేరాల నివారణలో సిసి కెమెరాల వినియోగాన్ని విస్తరిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు కోరమాండల్ ఎరువుల కర్మాగారం రూ.10 లక్షల విలువైన 96 సిసి కెమెరాలు అందజేయడం అభినందనీయమన్నారు. అదనంగా 94 హెల్మెట్లను పోలీస్ సిబ్బందికి అందజేశారన్నారు. ఈ. కార్యక్రమంలో డిఎస్‌పి మనీష్ దేవరాజ్‌పాటిల్, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి కెవి.సత్యనారాయణ, సర్పవరం సిఐ బి.పెద్దిరాజు, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ డి.దురాశేఖర్‌రెడ్డి, కెపిసిఆర్ ఇన్‌స్పెక్టర్ సన్యాసిరావు, కోరమాండల్ సంస్థ సీనియర్ ఎవిపి అండ్ యూనిట్ హెడ్ కె.జగన్నాథన్, సీనియర్ జనరల్ మేనేజర్(హెచ్ఆర్) పురుషోత్తం పద్మనాభం, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ జివి.సాయికృష్ణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కె.వంశీకృష్ణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) ఎస్.లక్ష్మీనారాయణ, డిప్యూటీ సీనియర్ మేనేజర్ వి.శ్రీను పాల్గొన్నారు.

ఆదిత్య క్యాంపస్ సందర్శన

ప్రజాశక్తి - సామర్లకోట

సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీని స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ ఒకేషనల్ విద్యార్థులు మంగళవారం సందర్శించారు. యూనివర్శిటీలోని పాలిటెక్నిక్, ఐటీ విభాగం, ఆటోమోటివ్ ట్రేడ్‌లను సందర్శించారు. ఆయా ట్రేడ్‌లపై ఇన్‌స్ట్రక్టర్లు అవగాహన కల్పించారు. విద్యార్థులకు హ్యాండ్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ అలవడుతుందని పాఠశాల హెచ్‌ఎం సాయి రామకృష్ణ తెలిపారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, గొల్లప్రోలు

ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి విడుదలైన చెక్కులను బాధితులకు మంగళవారం టిడిపి నాయకులు పంపిణీ చేశారు. ప్రమాదవశాత్తు గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎంఎల్‌ఎ పిల్లి అనంతలక్ష్మి సూచనలతో బాధితుల వద్దకే చెక్కులను తీసుకెళ్లి టిడిపి నాయకులు అందజేశారు. నియోజక వర్గ పరిధిలో 33 మందికి సుమారు రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని టిడిపి నాయకులు తెలిపారు. అలాగే గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు, చెందుర్తి, వన్నెపూడి, కొడవలి, ఎకె.మలవరం గ్రామాలకు చెందిన పలువురికి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను బాధితులకు అందజేశారు. జనసేన క్రియాశీలక వాలంటీర్లు మేడిశెట్టి నాగమణి, మర్రి దొరబాబు బాధితులకు అందజేశారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సూరిశెట్టి జయకృష్ణ, పెద్దింటి శివ, ఓరిగంటి పెద్దకాపు, చల్లా కామేశ్వరరావు, చేదురి కన్నయ్య, బద్రి తదితరులు పాల్గొన్నారు.

అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని ఎపిఆర్‌సిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని జెడ్.రాగంపేట గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విప్లవ అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ సమానంగా బతకాలని, వివక్షత, అస్పృశ్యత, దోపిడి, పీడన లేని సమాజం కోసం ఎందరో వీరులు తమ ప్రాణాలను తునప్రాయంగా అర్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వల్లూరి రాజబాబు, కుంచె అంజిబాబు, కడితి సతీష్, రెడ్డి దుర్గాదేవి, నాగమణి పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం తగదు

ప్రజాశక్తి - కోటనందూరు

ప్రయివేటు విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం తగదని సిపిఎం మండల కార్యదర్శి నక్కల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. తునిలో చదువుతున్న 15 ఏళ్ల కోండ్రు కార్తీక్ మృతి చెందడం బాధాకరమని అన్నారు. యాజమాన్యం పెడుతున్న ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

వల్లభుని హుండీల ఆదాయం రూ.37.23 లక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని తిరుపతిలో ఉన్న శృంగార వల్లభ స్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.37,23,308 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, డివిజనల్ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్ర పర్యవేక్షణలో దేవస్థానం ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య, ధర్మకర్తలు, సర్పంచ్ ముయిళ్ళ కృష్ణమూర్తి సమక్షంలో హుండీలను తెరిచి ఆదాయాన్ని లెక్కించారు. 126 రోజులకు సంబంధించి సాధారణ హుండీల ఆదాయం రూ.27,76,638, అన్నదాన హుండీల ఆదాయం రూ.9,46,670 ఆదాయం వచ్చిందన్నారు.

సఖి సురక్షతో ఆరోగ్యం, బీమా

ప్రజాశక్తి - సామర్లకోట

'సఖి సురక్షా' కార్యక్రమాల ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటు ఆరోగ్య బీమా లభిస్తుందని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. మంగళవారం స్థానిక రైతు భవన్ ఆవరణలో 'సఖి సురక్ష' మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. .ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, పెద్దాపురం మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, సిఎంఎం హుస్సేన, కూటమి నాయకులు పాల్గొన్నారు.